**కాలు విరిగిన కుర్చీకి ఎలాగో అవస్థపడి కుర్చీ కాలుకి మేకు బిగించి గోడకుఆన్చి టేబులు మీద వున్న తన కథలు, గేయాల రచనల కట్టలు, సన్మాన సంచికను చూస్తూ కూర్చున్నాడు. కవి సమ్రాట్ బిరుదాంకితుడు "సునమశ్రీ" ఉరఫ్ బలరాం.**

వంట ఇంటిలో శ్రీమతి గిన్నెల చప్పుళ్ళు టిఫెన్ కాలేదన్న మిషతో చిటపట లాడుతున్న పెద్దవాడు కుమార్, చిన్నవాడు రమేశ్ రాగాలాపన, ఊయలలో పాలకోసం గుక్కపెట్టి ఏడుస్తున్న పాప ఏడుపు, ఇవేవీ బాహ్య ప్రపంచంలోకి తీసుకురాలేక పోయాయి కవిగారిని.

అన్నరాగానికి శృతి నందుకున్న పాపరోదన ఆగుకుండా సాగడంతో బయటే ఉన్న భర్త కవేవీ వినిపించడంలేదా అని రుసరుస లాడుతూ, కలుపుతున్న కూరగంటే అలాగే చేతిలో పట్టుకొని బయటికి వచ్చి, బలరాంని చూసి ఏమండీ! పాప ఏడుపు వినిపించడం లేదా? అంటూ గబగబా ఉయ్యాలవద్దకు వెళ్ళి ఒక్కతోపుతోసి ఊపివచ్చినంత వేగంగా కూరమాడుతుందేమోననే భయంతో వంటింట్లో కెళ్ళింది.



తల్లి తోసిన తోపు స్పీడుకి ఉయ్యాల గోడకి గుద్దుకోవడంతో ఉలిక్కిపడ్డ పాప తన ఏడుపుశృతి పెంచడంతో తప్పని సరిగా రావలసివచ్చింది బలరాంకు. పాపను భుజానేసుకొని ఊరడించి జోకొడుతూ తనేనా కవిసమ్రాట్ అని ఆలోచింపసాగాడు.

జీవితంలో తాను బుద్ధి తక్కువ పనులు చేసినట్టుగా జ్ఞాపకం లేదు. ఎందుకంటే దరిద్రం అనుభవిస్తూనే, కాస్తో కూస్తో చదువుకున్నాడు. తల్లీతండ్రి తెచ్చిన సంబంధాన్ని నోరుమెదపకుండా చేసుకున్నాడు. "బాబూ! ఇకనా వల్లకాదురా! అని కుటుంబ భారాన్ని మోయమని ఇచ్చిన నాన్నగారి బరువును, తనకున్న విద్యతో ఒక ప్రెస్సులో చేరి పల్లెత్తకుండా మోశాడు. తనకు తెలిసినంతవరకు తల్లిదండ్రుల నాదరంగానే చూశాడు. రమేశ్ కడుపులో వున్నప్పుడే తల్లిదండ్రీ వారంరోజుల తేడాతో పోయినా ధైర్యం చిక్కబట్టుకున్నాడు. ప్రెస్సులో అనుభవాన్ని పురస్కరించుకొని తంటాలు పడి 'మమత' పత్రికాలయంలో ప్రూఫ్ రీడరుగా చేరాడు. అప్పుడే కథలుగాని, కవితలు గాని రాయాలన్న భావం కలిగి రాయడం మెదలు పెట్టి ఇంతవాడయ్యాడు. గవర్నమెంటు చెప్పినట్టుగా చిన్న కుటుంబమైతే చింతలుండవని బుద్ధిగా ఫ్యామిలీ ప్లానింగ్ చేశాడు. కాని ఈ కవిసార్వభౌమ బిరుదు వచ్చిన నాటినుండి కనీసం భాగ్యవంతులం కావాలని కోరకున్నా తన బిడ్డలడిగిన చిన్న సరదాలు కూడా తీర్చలేక పోతున్నాననే బాధ పడసాగాడు. వాళ్ళడిగిన ఏ చిన్నకోరికా తీర్చలేకపోతున్నాడు ఎందుకిలా అయింది. ఆలోచిస్తున్న బలరాంకి "వంటయింది స్నానం చేయండి", అన్న భార్య పిలుపు విని భుజం మీదే నిద్రపోయిన పాపను ఊయల్లో పడేసి స్నానానికి బయలుదేరాడు.

* * * *

ఆవాల్టికి మూడు రోజులైనా రమేశ్‌కి వచ్చిన ఫ్లూజ్వరం తగ్గక పోవడంతో డాక్టరుని తీసుకొచ్చి చూపెట్టాడు. ఆయన రాసిచ్చిన మందులు ఎలా తేవాలా? అని ఆలోచిస్తున్న బలరాంకి ఏమండీ! ఎక్కడైనా డబ్బు సంపాదించి ఆ మందులు తీసుకురండి అన్న భార్య మాటలకు తేరుకొని సరేనని అప్పుకోసం బయటకు నడిచాడు విధిలేక.

చెప్పులేసుకొని బయట అడుగుపెట్టాడో

# కవి సమ్రాట్

## డా॥ డింగరి నరహరి

లేదోతను వంద రూపాయలు ఇవ్వాల్సిన సేటు ఎదురుగా రావడంచూసి గుండె గుభేలుమంది, దగ్గరగా వచ్చిన సేఠ్ "నమస్కారమండీ! కవిగారు అనడంతో" నమస్తే! అన్నాడు. "భొత్తిగా మమ్మల్ని మరచిపోయారు. అన్న ఆయన వ్యంగ్య ధోరణిని అర్థం చేసుకున్న బలరాం "లేదు సేఠ్‌జీ! గుర్తుంది అన్నాడు వినయంగా, ఏంగుర్తో లెండి. తీసికెళ్ళినప్పుడే గాని ఇచ్చేప్పుడెక్కడుంటుంది. చెప్పులరిగేలా తిరగాల్సిందే, అన్నాడు నిష్ఠురంగా. వందరూపాయలకే అంతమాట లంటున్నా చేసేదేం లేకమౌనం వహించి శాంతంగా అబ్బేఅలా అనకండి! త్వరలోనే ఇచ్చేస్తాను" అని, ఇక ఆగితే తన దీనావస్థ ఎందరికంట్లో పడుతుందోననే భయంతో బజారులోకి నడిచాడు. "సరే అది చూస్తాను, అంటూ వెడుతున్న శేఠ్ మాటలు శూలాలా తగిలాయి. అతను తన వెనుక రావడం లేదని తెలిసి దీర్ఘంగా నిట్టూర్చి తనకు తెలిసి వున్న ఓ మిత్రుడింటికి వెళ్ళాడు.

ఎదురుగానే వున్న స్నేహితుడు రావోయ్ రా! అంటూ కుర్చీ చూపించిఆప్యాయంగా పలకరించి కాఫీ కూడా పోశాడు. కాని ఏవో సంభాషణలు జరిపి అడగవలసిన విషయం జ్ఞప్తికి వున్నా అభిమానం అడ్డుపడి అడగనివ్వక పోవడంతో సెలవు తీసుకొని బయట పడ్డాడు.

జ్వరంతో బాధపడుతున్న రమేశ్ రూపం కళ్ళముందు మెదలడంతో కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. తుడుచుకుని ఎదురుగా ఉన్న 'కవిత' పత్రికా కార్యాలయంలోకి అడుగుపెట్టాడు.

పత్రికాధిపతి "రండి, రండి! మీరడుగుపెట్టడంతో ఈ కార్యాలయమే పావనమైంది" అని పౌరాణిక పక్కీలో పొగడడం మొదలుపెట్టాడు. అవి సహించని బలరాం, "చూడండి, నాకు కాస్త పనుండి వచ్చాను" అన్నాడు నసుగుతూ. "అయ్యొయ్యో ఎంతమాట! చెప్పండి, ఏం కావాలో క్షణంలో చేసి పెడతాను."

"ఏం లేదు రామ్మూర్తిగారు! అవసరంగా ఓ యాభై రూపాయలు కావాలి. మళ్ళీ వారంలోగా ఇచ్చేస్తాను" అన్నాడు సిగ్గుపడుతూనే. ఆ మాటలు వినగానే అతగాడి ముఖ కవళికలు వెంటవెంటనే మారిపోయాయి.

"అన్నట్టు మీరు 'మమత' పత్రికలో పనిచేయడం మానుకున్నారట. అయినా మీలాంటి ఉత్తములు, పెద్దలు ఆ పని చేయడమేమిటి లెండి" అన్నాడు చిరునవ్వులొలకబోస్తూ.

హుఁ! తాను మానుకోవడమా! ఈ కవిసమ్రాట్ బిరుదు రావడంతో మీలాంటివారు ఈ పని చేయడం బాగుండదు. ఎవరైనా చూస్తే మమ్మల్నే తప్పుపడతారు అని తీసేశారు. ఇప్పుడీయనేమంటున్నాడు! 'మీలాంటివారు ఆ పని చేయడమేమిటి' అనా! అదే కాదు, ఏ ఉద్యోగం లేని తాను తన చిన్న కుటుంబాన్ని సాకడానికి, అంటే తిండికోసం ఏ పని చెప్పినా చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. వాళ్ళు అలా తీసేశారని చెప్పుకోలేక ఈ కథలూ, కవితలతో వచ్చే డబ్బుతో సంసారాన్ని ఈదలేక సతమతమవుతున్నాడు. అతని ప్రశ్నకేమని సమాధానమివ్వగలడు. అందుకే, "అవునండీ!" అన్నాడు. ఏమీ చెప్పుకోలేక ఇతగాడు తన డబ్బు తిరిగి ఎలా ఇవ్వగలడని ఆలోచిస్తున్నట్టుందని, "చూడండి! కొన్ని కొత్త ఆర్టికల్స్ పంపిస్తాను కావాలంటే ..." అన్నాడు బలరాం.

"క్షమించాలి రూల్స్ మారిపోయాయి ఇప్పుడు ఇక్కడ చేరినవాటికే స్థానం లేకుండా పడిపోయాయి. అందుకని దయచేసి మీరు ఇప్పట్లో ఏమీ పంపకండి, నేనే వచ్చి అవసరమున్నప్పుడు పట్టుకొచ్చుకుంటాను" అని నిర్మొహమాటంగా చెప్పడంతో విషం తిని చచ్చినా బాగుండుననిపించి సుమనశ్రీ నాలుక పిడుచకట్టుకుపోగా, "వస్తాను!" అని బయటపడ్డాడు.

సంవత్సరం క్రితం ఎంత డబ్బడిగినా ఇచ్చే ఇతను తన అవసరం తీరి పత్రికకి పేరు సంపాదించిపెట్టిన తననే మరచిపోయాడు, ఎంతలో ఎంత మార్పు. నోరు జారవిడిచినా పరువు నిలువలేదు. కళ్ళు బైర్లు కమ్మసాగాయి. భారంగా అడుగులు వేస్తూ తన ఇంటివైపు నడవసాగాడు.

"హలో బలరాం! బాగున్నావా?" అన్న పిలుపు విని, తల పైకెత్తాడు.

"హల్లో హరిశ్చంద్రా! బాగున్నావా?" అన్నాడు బలరాం. హరిశ్చంద్ర ఎల్.ఐ.సి.లో పనిచేస్తూ హాయిగా జీవితం గడుపుతున్నాడు. బలరాం సన్నిహిత మిత్రుడు.

"ఆఁ!" అని సమాధానం చెప్పి, "అదేమిటి బలరాం! అలా ఉన్నావు?" అని ప్రశ్నించాడు. "ఏం లేదు" అని సందేహిస్తూనే, "చూడు, హరిశ్చంద్రా! అవసరంగా ఉంది ఓ యాభై రూపాయలుంటే ఇవ్వు ఇంట్లో పిల్లాడికేం బాగాలేదు" అన్నాడు. "అరెరే! నీ వడిగిన రోజే లేకుండా పోయిందే. సరే, నా అవసరానికని దాచుకున్న ఈ పదీ ఉంచు" అంటూ పది రూపాయల నోట్లు కట్టనుండి ఓ నోటు తీసి చేతిలో పెట్టి అక్కడే ఉంటే ఇంకేమైనా అడుగుతాడేమో "వస్తాను, క్లబ్బుకి లేటైంది" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

తనలో తనే నవ్వుకుని బలరాం ఆ పదిరూపాయలు ఏం చేసుకోవాలో తెలియక ఇంకెక్కడా ముఖం చూపించలేక ఇంటికొచ్చాడు.

ఎదురుగా సన్మాన సంచిక, తనకిచ్చిన బిరుదు పత్రం వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి. "ఏమయిందండీ!" అన్న భార్యకి జవాబివ్వలేక తల వంచుకున్నాడు. "బాబుకెలా ఉంది?" అని ప్రశ్నించాడు. "కొద్దిగా తగ్గుముఖం పట్టినట్లే పట్టి మళ్ళీ ఈ సాయంత్రం నుండి ఉధృతమవుతున్నది" అంది విచారంగా. ఆ మాటలు విని కూడా చేసేదేమీ లేక అప్పునెవరినీ అడగలేక భగవంతుడిపై భారాన్ని వేసి ఊరుకున్నాడు.

మింగుడు పడని అన్నంలో చేయి కడిగి లేచిపోతున్న భర్తవైపు దీనంగా చూస్తూ నిలబడింది బలరాం భార్య. గదిలోకి వచ్చి పడుకున్నాడే కాని ఎడతెగని ఆలోచనలు నిద్రపట్టనివ్వడం లేదు.

"తానేం పాపం చేశాడు కథలు, కవితలు రాయడం తప్పా! కనీసం కడుపునిండి తృప్తిగా ఉంటున్నాడనుకుంటున్న సమయంలో ప్రభుత్వం వారు తన "క్రాంతిపథా"నికి బహుమతి ప్రకటించి ఆ భాగ్యానికీ నోచుకోకుండా చేసింది. ప్రభుత్వ బహుమతిని పొందిన నాటినుండి ఉన్న గౌరవం పోయింది. అతిగౌరవంతో ఎవరూ దగ్గరకు రానివ్వడం లేదు. పత్రికాధిపతులు గౌరవిస్తున్నారే తప్ప జీవనాధారం చూపడం లేదు. బిరుదువల్ల కడుపులు నిండవుకదా! ఈ

దేశంలో సామాన్య జీవితం గడుపుతామన్నా మధ్యతరగతి వాడికి సాధ్యపడడం లేదు. కవిత్వం రాసిన పాపానికి 'కవిసమ్రాట్' అని బిరుదు ఇచ్చి ఆనాటి శ్రీనాథుని చివరి దశను చవిచూడమన్నది. సభలని, సన్మానాలని మోయలేని దండలు వేసి పొగిడారే కాని కనీసం భిక్షమెత్తే అర్హత కూడా తొలగించామని గుర్తెరిగిందా ఈ ప్రజ. నాకు పట్టిన ఈ దీనావస్థను ఆలోచించే మనిషున్నాడా ఈ లోకంలో. పత్రికలానాడు తన జీవితాన్ని ఇంతవాడు, అంతవాడు అని పరిచయం చేసింది కాని ఈనాడున్న స్థితిని విప్పి చెప్పదేం. బిరుదులు, సన్మానాలు గౌరవదాయకాలని అనుకున్నాడే కాని ఉన్న ఉద్యోగాన్ని ఊడగొడుతుందని ఊహించలేదు. "భగవాన్! ఇదేం న్యాయం? ఒక మనిషి మంచి మాటలతోనే బ్రతకడని, అతనికి సమాజం ద్వారా అన్ని అండదండలు కావాలని, ఉన్నవాడు లేనివాడిని ఆదుకోవాలని తెలుసుకునే శక్తిని నీ సృష్టిలో ఎందుకు కలిగించలేదు. కవిత రాయడం కాదు, తెల్లవారితే ఎలా గడుస్తుందా? అనే ఆలోచనలతో దినం గడుస్తున్నది. ఈ బిరుదు లేనప్పుడు అందరూ సన్నిహితంగా తిరిగారు. హాయిగా అందరితో కలిసి జీవించాడు. దీనివల్ల దగ్గరి మిత్రులు కూడా తనేదో పెద్దవాడినని దగ్గరగా రాలేక పోతున్నారు. నోరు విడిచి అడిగినా హరిశ్చంద్ర పది రూపాయలు విదిల్చాడు. తనని తిరిగి ఎలా అడగాలని అతగాడి ఆలోచన. కేవలం కవితలనాదరించి బ్రతుకుదెరువు కల్పించే సమాజం కాదు మనది. సమాజ ఉద్ధరణకేనని చేపట్టిన ఈ వ్యాసంగం కడుపు కూడా కొంత నింపగలుతున్నదని కొన్ని రోజులు సంతోషించాడు. ఎన్ని రాతలు రాసినా మనిషి మనుగడలో మార్పు రాలేదు. అది లేనినాడు ఈ సన్మానాలు, సభలూ తనకక్కర్లేదు. కడుపే నిండని తనకు 'కవిసమ్రాట్' బిరుదుతో పనిలేదు. బిరుదు పత్రాన్ని చూస్తే విసిరేయాలనిపిస్తున్నది. చించేయాలనిపిస్తున్నది. "వద్దు, వద్దు! తనకీ జీవితం వద్దు. పైపై మెరుగుల గౌరవాలు వద్దు. ఈ బిరుదులు వదలి తానంటే తెలియని దేశానికి వెళ్లి మామూలు మనిషిగా బ్రతకాలి. ఆ జీవితం కావాలి. ఈ దేశంలో మామూలు నాయకత్వం పనిచేసిన రాజకీయ చతురులకు పింఛన్లున్నాయి. దేశోద్ధరణకు కవిత్వం రాసిన కవికి పింఛను లేదు. ఉన్నా ఎందుకూ చాలని ముష్టివిధానాలే!

'వద్దు, వద్దు, నాకీ సన్మానం వద్దు. మీరు నా ముఖం కూడా బజారులో తిరిగే అర్హత పోగొట్టవద్దు. వద్దు వద్దు. నేను రాను' అని పలవరిస్తున్న, కేకలు వేస్తున్న భర్తను "ఏమండీ, ఏమండీ!" అని తట్టి లేపింది బలరాం భార్య.

కళ్లు తెరిచిన బలరాంకి "మళ్లీ తనకి సన్మానం చేస్తామని మొత్తం దేశంలోనే మీకు పేరు వస్తుందని పెద్దపెద్ద వాళ్లు రావడంతో' భయపడి తాను అలా అరవడం గుర్తుకు వచ్చి అదంతా కలేనని తెలిసి కొంత సంతృప్తి చెంది నిట్టూర్చాడు.

"ఏమయిందండీ!" అని అంటున్న భార్యకి "ఏమీలేదు. నువ్వు పడుకో!" అని మరోవైపు తిరిగి బిరుదులకు దూరంగా ఉండి బ్రతుకుమన్న తాను ఆ కొత్త ప్రపంచాన్ని ఊహిస్తూ నిద్రకు ఉపక్రమించాడు కవిసమ్రాట్ 'సుమనశ్రీ' ఉరఫ్ బలరాం అనే అభాగ్యజీవి. •

# హార్మోన్లను అనుకరించే రసాయనాలు

ఈస్ట్రోజన్ వంటి సహజ హార్మోన్లను అనుకరించే కృతకర రసాయనాల వల్ల మానవులకు, వన్య ప్రాణులకు తీవ్రమైన ప్రమాదం వాటిల్ల వచ్చునని పర్యావరణవాదులు హెచ్చరిస్తున్నారు. సూక్ష్మ పరిమాణాలలో కూడా అవి పిండాభివృద్ధి, ఫలవంతం వంటి ముఖ్య ప్రక్రియలకు అవి ఆటంకం కలిగించవచ్చునని అంటున్నారు.

ఎండోక్రైన్ గ్రంథుల స్రావాలకు అంతరాయం కలిగిస్తాయనుకునే రసాయనాలు భూమిలోనూ, నీటిలోనూ విస్తారంగా ఉన్నాయి. పురుషుల శుక్రకణాల సంఖ్యలను తగ్గించడం, రొమ్ము ప్రోస్టేట్ కాన్సర్ వంటి వ్యాధులు కలిగించడం, గర్భస్థ శిశువుల మీద ప్రభావాల వంటివి సంభవించవచ్చునని అంటున్నారు. వీటి ప్రభావం వల్ల పుట్టిన పిల్లలు తెలివి తక్కువగా ఉండడం, అతి చురుకుతనం, హింసాత్మక ప్రవర్తన వంటి లక్షణాలు కనిపించవచ్చునని హెచ్చరిస్తున్నారు.

కాని శుక్ర కణాల సంఖ్య తగ్గడం గురించి నిపుణులలో తీవ్రమైన వివాదాలున్నాయి. చేపల, పక్షుల జనాభాలకు ఈ రసాయనాల వల్ల హాని కలుగవచ్చునని కొందరు జీవ శాస్త్రవేత్తలు అంగీకరించినప్పటికీ ఇతర శాస్త్రవేత్తలు అటువంటి భయాలకు వాస్తవమైన ఆధారంలేదని అంటున్నారు.

ఇటువంటి రసాయనాలలో డి. డి. టి., పారిక్లోరినేటెడ్ బై ఫెనీల్స్ లేదా పి. సి. బి. లు, ప్లాస్టిక్ డిటర్జెంట్లు, కీచక నాశనాలు వంటివి చేరతాయి.

కొన్ని కృత్రిమ రసాయనాలు ప్రత్యుత్పత్తి హార్మోన్లను అనుకరించవచ్చునని శాస్త్రవేత్తలు అంగీకరిస్తారు. అంతేకాక వీటిలో కొన్ని రసాయనాలు కొన్ని ప్రదేశాలలో, కొన్ని సమయాలలో వన్యప్రాణులకు హాని కలిగించే స్థాయిలకు చేరుకున్నాయని అనడంలో సందేహంలేదని అంటున్నారు. అయితే సూక్ష్మ ప్రమాణాలలో ఈ రసాయనాల ప్రభావాలు మానవుల మీద ఎలా ఉంటాయనేదే ప్రశ్న. మొక్కలలో సహజంగా ఉండే హార్మోన్లకన్నా కృత్రిమ రసాయనాల స్థాయిలు చాలా తక్కువ. రెండింటి ప్రభావాలూ ఒకే మాదిరిగా వుంటాయి. ప్రజలు తమ ఆహారంలో తీసుకునే ఎస్ట్రోజన్ వంటి సమ్మేళనాల పరిమాణంలో ఒక శాతంలో వెయ్యోవంతుకన్నా తక్కువ ప్రమాణంలో కృత్రిమ రసాయనాలుంటాయని డాక్టర్ స్టీఫెన్ సేఫ్ అనే శాస్త్రవేత్త లెక్కగట్టాడు.

కీటక నాశనాలు రైతులకు, వారి భార్యలకు రొమ్ము, ప్రోస్టేట్ కాన్సర్ కలిగించే అవకాశం ఉందా అనే విషయం గురించి అమెరికాలోని నేషనల్ కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వారు పరిశోధిస్తున్నారు. అయితే పెద్ద మోతాదుల్లో ఒకవేళ ఈ రసాయనాలు ఇటువంటి విషమ ప్రభావాలు చూపుతాయని చివరికి రుజువైనా చాలా తక్కువ స్థాయిలో అవి అటువంటి ప్రభావాలు చూపుతాయని తప్పనిసరిగా చెప్పడానికి వీలులేదు —అది ఆ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఫెలిజాం అంటున్నారు.

ఇటువంటి రసాయనాలు ఎలకలలో స్వల్పకాలిక జ్ఞాపక శక్తిని తగ్గిస్తున్నాయని కొన్ని పరిశోధనలలో తేలింది. అంటే పర్యవసానంగా వాటి తెలివితేటలు తగ్గుతున్నాయని భావించవచ్చు.

కొన్నిచోట్ల చేపలలో థైరాయిడ్ సమస్యలున్నాయి.

మెదడు అభివృద్ధిలో కీలకమైన సమయాలలో థైరాయిడ్ గ్రంధి చర్యలలో కొద్దిపాటి వ్యత్యాసాలున్నా దానివల్ల ప్రవర్తన సమస్యలు, తెలివితేటలకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతాయని థైరాయిడ్ శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఎండోక్రైన్ గ్రంథులకి అంతరాయం కలిగించే రసాయనాలు తల్లిదండ్రులు తమ పిల్లలను నిర్లక్ష్యం చేసేట్లు చేయవచ్చుననే ప్రమాదం ఉందని పర్యావరణవాదులు అంటున్నారు. "అవర్ స్టోలెన్ ఫ్యూచర్" అనే ఇటీవల ప్రచురించిన గ్రంథంలో రచయితలు డాక్టర్ థియోకోల్‌బార్న్, డాక్టర్ జాన్ పీటన్ సన్‌లు ఈ అభిప్రాయాలు వెలిబుచ్చారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నంకావడం, పిల్లలను నిర్లక్ష్యం చేయడం సంగతి ఏమిటి? అయితే ఇన్ని విభిన్న రకాల ప్రభావాలను కృతకరసాయనాలకు ఆపాదించడం సమంజసమా అని కొందరు శాస్త్రవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

ఆర్. ఎల్.